డీజీపీ మార్పుపై ఉత్కంఠ!

- రేసులో ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్
- ఈ ఏడాది చివరిలో శివధర్‌రెడ్డికి చాన్స్?
- వారంలోపే సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు!

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డీజీపీని మార్చుతారనే చర్చ జోరుగా సాగుతున్నది. నెక్స్ట్ పోలీస్ బాస్ ఎవరనే ఉత్కంఠ పోలీసువర్గాల్లో మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ బదిలీల్లో డీజీపీగా నియమితులైన రవిగుప్తాకే కొత్త ప్రభుత్వం పూర్తి బాధ్యతలు ఇచ్చింది. ఇటీవల రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పడం, ఎక్కడ చూసినా చైన్‌స్నాచింగ్ ముఠాలు, దోపిడీ గ్యాంగులు హల్‌చల్ చేస్తుండటం, నడిరోడ్లపైనే హత్యలు జరుగుతుండటంతో డీజీపీ మార్పు అనివార్యంగానే కనిపిస్తున్నట్టు పోలీసువర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికిప్పుడు డీజీపీని మార్చితే.. డీజీ హోదా కలిగిన జితేందర్ ఐపీఎస్‌కు అవకాశం ఉన్నదని అంటున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ ఏసీబీని ఓ గాడిలో పెట్టడంతో ఆయన్నే ఏసీబీ డీజీగా కొనసాగిస్తారని చెప్తున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్ ఇప్పటికే డీజీపీగా చేయడం, అదే బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా డీజీపీగా కొనసాగుతుండటం, 1991వ బ్యాచ్‌కు చెందిన రాజీవ్‌రతన్ గుండెపోటుతో చనిపోవడంతో 1992వ బ్యాచ్‌కు చెందిన జితేందర్ డీజీపీగా నియమిస్తారనే చర్చ కొనసాగుతున్నది. 1993వ బ్యాచ్‌కు చెందిన సందీప్‌శాండిల్య ఇటీవల పదవి విరమణ పొందటం, 1994 బ్యాచ్‌కు చెందిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సీపీగా ఉండగా, సౌమ్యమిశ్రా జైళ్లశాఖ డీజీగా, శివధర్‌రెడ్డి ఇంటెలిజెన్స్ డీజీగా, శిఖాగోయెల్ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐడీగా, ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీగా, అభిలాష బిస్త్ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వీరికి ఇంకా డీజీపీ హోదా రాకపోవడంతో సీనియర్ అయిన జితేందర్, సీవీ ఆనంద్‌కే డీజీపీ అవకాశం ఎక్కువగా ఉన్నట్టు పోలీసువర్గాలు చెప్తున్నాయి. వీరిద్దరిలో ఎవరినో ఒకరిని డీజీపీగా నియమించినా.. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది త్రైమాసికంలోనే డీజీపీగా శివధర్‌రెడ్డిని నియమిస్తారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. వారంలోపే సీనియర్ ఐపీఎస్‌లకు సైతం స్థానచలనం కల్పించనున్నట్టు తెలిసింది.

బదిలీల్లో మంత్రులు బైపాస్

మొదటిపేజీ తరువాయి...

పలువురు మంత్రులు చేస్తున్న సిఫారసులు బుట్టదాఖలవుతున్నాయని కొత్త చర్చ నడుస్తున్నది. మంత్రుల ఆదేశాల మేరకే ఆయా శాఖల్లో ప్రాథమికంగా జాబితా సిద్ధమవుతున్నదని.. అయితే సీఎం ఆఫీసుకెళ్లిన తర్వాత మార్పులు, చేర్పులు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. మారిన విషయం మంత్రులకు తెలియడం లేదని, జీవోలు విడుదలైన తర్వాత వాళ్లు అవాక్కవుతున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వం ఓ సలహాదారును నియమించింది. ఆయన నియామకం సదరు శాఖ మంత్రికి తెలియదని తీవ్ర చర్చ జరుగుతున్నది. ఆయన ఓ సమాశంలో ఉండగానే ఓ అధికారి ఈ నియామకంపై మంత్రికి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. తన శాఖలో తనకు తెలియకుండానే సలహాదారులను నియమించడమేంటని ఆయన అసహనం వ్యక్తం చేశారని అధికారుల్లో చర్చ జరుగుతున్నది.

కింది స్థాయి అధికారుల్లోనూ..

కోడ్ పూర్తయిన నేపథ్యంలో తమను తిరిగి వెనక్కి పంపాలని పలు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ఎవరెవరు వెళ్తారనేది ఓ అంతుచిక్కని ప్రశ్నగా మారింది. రెవెన్యూ శాఖకు చెందిన ఓ సం ఘం నాయకులు మాట్లాడుతూ.. 'మేం జా బితా సిద్ధం చేసి పంపుతాం. మంత్రి ఆమోదిస్తారు. కానీ సీఎంవోలో మార్పులు జరుగుతాయి' అని పేర్కొన్నారు.

పోడు రైతులకు సర్కారు అన్యాయం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పోడు రైతులకు అన్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ఆరోపించారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు రైతులు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నారని, ఉన్న ఫళంగా భూములు గుంజుకుంటే వారు ఆగమవుతారని తెలిపారు. పోడు రైతులపై అటవీ అధికారుల దాష్టీకాలు పెరుగుతున్నాయని, వీటిని ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రైతులు సంఘటితం కావాలని, అధికారుల అరాచకాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. మెదక్‌లో హిందూ యువకుల మీద రాళ్ల దాడి ఘటనలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని మండిపడ్డారు. ఈ ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

'టిమ్స్' 21 అంతస్థులట!

- 14 అంతస్థులకు తగ్గించారట!
- కనీస అవగాహన లేని మంత్రులు
- మొన్న కోమటిరెడ్డి, నేడు దామోదర..
- నిర్ణయించిందే జీ+14గా నిర్మాణం
- ఎయిర్‌పోర్ట్ కారణంగా అల్వాల్‌లో జీ+5
- మంత్రుల వ్యాఖ్యలపై ప్రజల్లో విస్మయం

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు నగరం నలువైపులా బీఆర్‌ఎస్ హయాంలో మొదలైన టిమ్స్ దవాఖానలపై కాంగ్రెస్ మంత్రుల అవగాహన రాహిత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. వాస్తవానికి టిమ్స్ భవనాలను జీ+14గా నిర్మించాలని ఆనాడే నిర్ణయించి పనులు చేపట్టారు. కానీ 21 అంతస్థుల్లో నిర్మిస్తుంటే తామే 14 అంతస్థులకు తగ్గించామని ఇటీవల ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించగా, తాజాగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సైతం ఇవే వ్యాఖ్యలు చేశారు. మంగళవారం

నిర్మాణంలో ఉన్న ఎల్‌బీ నగర్ టిమ్స్

తన నివాసంలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ దవాఖానల ఎత్తును 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామని చెప్పి అభాసుపాలయ్యారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టిమ్స్‌ను ఏర్పాటు చేస్తుండగా ఆర్అండ్‌బీ శాఖ నిర్మాణ బాధ్యతలు చూస్తున్నది. ఇద్దరు మంత్రులు కనీసం వివరాలు తెలుసుకోకుండా మాట్లాడటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అల్వాల్, ఎల్బీనగర్, సనత్‌నగర్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. వీటిలో ఎల్బీనగర్, సనత్‌నగర్ భవనాలను జీ+14గా, అల్వాల్‌లో జీ+5గా నిర్మించాలని నిర్ణయించారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న నేపథ్యంలో అల్వాల్‌లో ఎత్తు తగ్గించినట్టు అప్పట్లో వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. ఈ మేరకు పనులు కూడా జరుగుతున్నాయి.

రెండేండ్ల తర్వాతే వైద్యశాఖలో మార్పులు

వైద్యశాఖలో ప్రక్షాళన ప్రారంభమైందని, ఒకటి, రెండేండ్లలో స్థిరమైన మార్పు కనిపిస్తుందని మంత్రి దామోదర చిట్‌చాట్‌లో చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో మూడు రకాల టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రైవేట్ దవాఖానలపై పర్యవేక్షణ, ఔషధాలు, ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి 35 కిలో మీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఉండేలా కొత్తగా 75 కేంద్రాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

ఎమ్మెల్సీ కవితతో సబిత, సత్యవతి ములాఖత్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ములాఖత్ అయ్యారు. ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్న కవితను మంగళవారం వారు కలిశారు. కవిత యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కాసేపు వారు చర్చించుకున్నట్టు సమాచారం.

ఆ కుటుంబాలకు 15లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల విధుల్లో మరణించిన 13 మంది ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు మొత్తం రూ.195 లక్షలను విడుదల చేస్తూ సీఈవో వికాస్ రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'దివ్యాంగుల పెన్షన్ పెంచకపోతే సీఎం ఇంటి ముట్టడి'

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే దివ్యాంగుల పెన్షన్ పెంచాలని ఆలిండియా డిసేబుల్డ్ రైట్స్ ఫోరం (ఏఐడీఆర్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఏఐడీఆర్‌ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే దివ్యాంగులకు పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆరు నెలలు గడిచినా సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రవీందర్ తదితరులున్నారు.

జన్నారం ఎంపీడీవో ఆఫీసులో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎదుట సామాజిక కార్యకర్త భూమాచారి నిరసన

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు నిరసన సెగ

జన్నారం, జూన్ 18 : మంచిర్యాల జిల్లా జన్నారంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు నిరసన సెగ తగిలింది. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఆయన ముందు.. జన్నారం ఫారెస్టులో వాహనాల రాకపోకలపై నిషేధాన్ని ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి నిరసన తెలిపారు. తన ఒంటిపై డిమాండ్‌లతో కూడిన ఫ్లెక్సీని తొడుక్కొని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యలను సంబంధిత మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లోకం పోకడ

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.3°c	23.7°c
రంగారెడ్డి	39.9°c	22.0°c
నల్లగొండ	39.0°c	25.8°c
మెదక్	37.9°c	23.4°c
కరీంనగర్	37.0°c	27.0°c
వరంగల్	37.0°c	27.0°c
నిజామాబాద్	36.3°c	26.6°c
మహబూబ్‌నగర్	35.4°c	26.0°c
ఖమ్మం	35.0°c	27.0°c
హైదరాబాద్	34.0°c	25.0°c

ఐదురోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాగల ఐదురోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కోస్తాంధ్రను ఆనుకొని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆవర్తన ద్రోణి ఉన్నదని, అలాగే సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో రాయలసీమ, పరిసర ప్రాంతాల్లో ఆవర్తనం కొనసాగుతున్నదని పేర్కొన్నది. గోవా నుంచి దక్షిణ కోస్తాంధ్ర వరకు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో తూర్పు-పడమర ద్రోణి బలహీనపడిందని వెల్లడించింది. ఈ క్రమంలో వచ్చే ఐదురోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది.

ఆసిఫాబాద్‌లో గాలివాన బీభత్సం

జైనూర్/చెన్నూర్ రూరల్, జూన్ 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. జైనూర్ మండలం పానాపటార్ గ్రామ పంచాయతీ పరిధిలోగల గోలేటినగర్ గ్రామంలో ఈదురు గాలులకు ఓ రెండు ఇండ్ల పైకప్పు రేకులు, పెంకులు గాలికి లేచిపోయాయి. విద్యుత్తు స్తంభం విరిగి ఇండ్లపై పడింది. ఓ ఇంట్లోని సామగ్రి తడిసి ముద్దయ్యింది. సాగు కోసం తీసుకొచ్చిన రూ. 30 వేల విలువైన విత్తనాలు, ఎరువులు తడవడం నష్టంజరిగింది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం ఆస్నాద్, రచ్చపల్లి, బీరెల్లి, నాగాపూర్, సోమన్‌పల్లి, కొమ్మెర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఆస్నాద్ ప్రధాన రహదారిలో ఉన్న చెట్లు విరిగి రోడ్డు మీద పడ్డాయి. విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. ఇంటిముందు ఉన్న రేకులు గాలికి లేచిపోయాయి. కిష్టంపేటలో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్ల మీద పడ్డాయి.

అతిథి గృహమా? క్యాంప్ ఆఫీసా?

మొదటిపేజీ తరువాయి...

కొత్త గెస్ట్‌హౌస్ ఎందుకు కడుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక సీఎం క్యాంప్ కార్యాలయం కోసం పలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఇక్కడ నిర్మాణం కొనసాగుతుండడంతో దీనిని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం కోసం వినియోగించే అవకాశముందనే వాదనలు వస్తున్నాయి. గెస్ట్‌హౌస్ కోసమని ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రెండు అంతస్థుల్లో, పదివేల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా ఉండేలా దీన్ని నిర్మిస్తున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ, ఇది దేనికోసమనేదానిపై అధికారుల్లోనూ స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికే నగరంలో అనేక ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రీన్‌ల్యాండ్, దిల్‌కుషా, ఇందిరాపార్క్ గెస్ట్‌హౌస్, టూరిజం శాఖకు చెందిన తారామతి బారాదరి, హరిత ప్లాజా, శిల్పారామం తదితర భవనాలను గెస్ట్‌హౌస్‌లుగా వినియోగించుకునే వీలుంది. కొత్తగా కట్టిన సచివాలయంలోనూ దేశ విదేశాల అతిథుల కోసం పైఅంతస్థుల్లో అత్యాధునిక హంగులతో గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు. రాష్ట్ర విభజన తర్వాత కొన్ని మంత్రుల బంగ్లాలను ప్రభుత్వ సలహాదారులకోసం కేటాయించారు. వీటిని కూడా గెస్ట్‌హౌస్‌లుగా ఉపయోగించుకునే అవకాశముంది. ప్రస్తుత ప్రజాభవన్ కూడా నగరం నడిబొడ్డున ఉండి గెస్ట్‌హౌస్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇన్నిరకాల అవకాశాలున్నా ప్రత్యేకంగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గెస్ట్‌హౌస్ నిర్మాణం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

క్యాంప్ ఆఫీస్‌కోసం పలు భవనాల పరిశీలన

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం క్యాంప్ ఆఫీస్ కోసం అధికారులు పలు భవనాలను పరిశీలించారు. పైగా ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్, బేగంపేట మెట్రో రైల్ భవన్, నానక్‌రామ్‌గూడ గ్రోత్ కారిడార్, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ భవనాలు ముఖ్యమైనవి. అన్నీ చూసిన తర్వాత ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గెస్ట్‌హౌస్ నిర్మాణం ప్రారంభించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ప్రాంతంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఉంటున్నందున అక్కడ గెస్ట్‌హౌస్ కట్టి దాన్ని సీఎం క్యాంప్ ఆఫీస్‌గా వినియోగించుకునే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.

21న క్యాబినెట్ సమావేశం?

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర క్యాబినెట్ భేటీ 21న నిర్వహించనున్నట్టు సమాచారం. బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అన్ని శాఖల నుంచి వివరాలు సేకరించి, క్యాబినెట్ భేటీ లో చర్చించాలని నిర్ణయించినట్టు సమాచారం. దీని ఆధారంగా నెలాఖరులో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం.

ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం!

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ఫైల్ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి చేరినట్టు తెలుస్తున్నది. ఆమోదం పొందిన తర్వాత మార్గదర్శకాలు విడుదల చేసి 15 రోజుల్లోపు బదిలీలు పూర్తి చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఒకేచోట కనిష్ఠంగా రెండేండ్లు పనిచేసినవారికి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. గరిష్ఠంగా నాలుగేండ్లు ఒకేచోట పనిచేసినవారిని కచ్చితంగా బదిలీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ఈ బదిలీలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖలో ప్రక్షాళన జరుగుతుందని చెప్తున్నారు. ఆయా శాఖల్లో కొందరు అధికారులు ఏండ్లుగా తిష్ట వేసుకొని పాతుకుపోయారు.

సాంకేతిక కేంద్రాలుగా ఐటీఐలు

- 2,324 కోట్లతో 65 ఐటీఐలు మార్పు: సీఎం రేవంత్
- స్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

సుల్తాన్ బజార్/హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐటీఐ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లను అధునాతన సాంకేతిక కేంద్రాలు(ఏటీసీ)గా అభివృద్ధి చేయనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఐటీఐల్లో ఇప్పటికీ నాలుగైదు దశాబ్దాల నాటి నైపుణ్యాలనే బోధిస్తున్నారని, ప్రస్తుత అవసరాలకు అవి ఉపయోగం లేకుండా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను యువతకు అందించటమే లక్ష్యంగా ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం సీఎం స్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ట్రేడ్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్టంలోని ప్రభుత్వ ఐటీఐలు నిరుపయోగంగా మారాయని, ఐటీఐల్లో నేర్పించే నైపుణ్యాలు విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయాయని అన్నారు. 40- 50 ఏండ్ల కిందటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారని చెప్పారు. అందుకే తన సొంత ఆలోచనల నుంచి వచ్చినవే ఏటీసీ సెంటర్లు అని చెప్పారు. 40 లక్షల మంది యువత ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారని, ఉద్యోగం సాధించేందుకు సర్టిఫికెట్

హైదరాబాద్ మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ ప్రాజెక్టుకు భూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉంటే సరిపోదని, సాంకేతిక నైపుణ్యం తప్పనిసరి అని చెప్పారు. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని తెలిపారు. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకొచ్చిన టాటా యాజమాన్యానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఐటీఐల్లో చేరాలని, ఈ శాఖ తన దగ్గరే ఉంటుందని, తానే పర్యవేక్షిస్తానని, వీటి పనితీరుపై ప్రతి నెల సమీక్ష నిర్వహిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టాటా టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలకు మంగళం!

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలన్నింటినీ వరుసగా రద్దు చేస్తూ వస్తున్న కాంగ్రెస్ సర్కారు... యథావిధిగా న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను కూడా రద్దు చేసింది. వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించేందుకు ఉద్దేశించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్‌ఏసీ)ను మరింత అభివృద్ధి చేయడంతోపాటు అన్ని జిల్లాల్లో న్యాక్ అనుబంధ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో రూ.10కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను మంజూరు చేసింది. వీటి నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వీటికి మంజూరు చేసిన నిధులను రద్దుచేసింది. రాష్ట్రం నుంచి దేశవిదేశాలకు వెళ్తున్న వివిధ వృత్తిపనివాళ్లకు, ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి నైపుణ్యాలను బోధించేందుకు ఉద్దేశించిన ఈ కేంద్రాలను రద్దు చేయొద్దని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కోరినా ఫలితం లేకుండా పోయింది.

బీఆర్‌ఎస్ హయాంలో జగిత్యాల జిల్లా నాగులపేటలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులు

అభివృద్ధిని ఓర్వలేకే.. శిలాఫలకం ధ్వంసం

కోరుట్ల రూరల్, జూన్ 18: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని ఓర్వలేకే కొందరు కావాలనే జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం నాగులపేటలో శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం నాగులపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సహకారంతో నాగులమ్మ కల్యాణ మండపాన్ని రూ.13 లక్షలతో నిర్మించామని, అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంతమంది నాయకులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

- కుంటాలకు జలకళ

తెలంగాణలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరు పొందిన కుంటాల జలపాతానికి జలకళ సంతరించుకున్నది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వరద నీరు వచ్చి చేరడంతో జలపాతం కళకళలాడుతున్నది. – నేరడిగొండ

ఉద్యానశాఖకు 100 కోట్లు విడుదల

హైదరాబాద్, జూన్ 18(నమస్తే తెలంగాణ): పామాయిల్ సాగు, సూక్ష్మ సేద్యానికి రూ. 100.76 కోట్ల బకాయిలను విడుదల చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2023-24 సంవత్సరానికి మొత్తం 133.50 కోట్లు నిధులు అవసరం కాగా, ఇందులో గత ప్రభుత్వం రూ. 32.72 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. మిగిలిన రూ.100.76 కోట్ల నిధులను ప్రస్తుతం విడుదల చేసినట్టు తెలిపార. ఈ నిధులను రెండుమూడు రోజుల్లో పామాయిల్ రైతులకు, సూక్ష్మసేద్యం కంపెనీలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖను మంత్రి ఆదేశించారు. ఇక ఇప్పటికే 2022-23కు సంబంధించి సూక్ష్మసేద్యం బకాయిలు రూ. 55.36 కోట్లను విడుదల చేసినట్టు తెలిపారు.

గుండెపోటును గుర్తించిన ఆపిల్ వాచ్

- ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

వేములవాడ, జూన్ 18: ఆపిల్ వాచ్ చేసిన అలర్ట్‌తో ముందస్తు గుండెపోటు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ. కొద్దిరోజులుగా ఆయన ఆపిల్ వాచ్ వాడుతున్నారు. ఇటీవల కాలంలో కొంతదూరం నడిస్తే ఆయాసం, ఛాతిలో మంటలా ఉన్నప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు. గుండెకు సంబంధించిన ఇబ్బంది ఉన్నదని, తక్షణమే వైద్యుల సలహా తీసుకోవాలని ఆపిల్ వాచ్ సోమవారం అలర్ట్ చేసింది. అప్రమత్తమైన ఆయన వరంగల్ వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన డాక్టర్లు గుండెకు సంబంధించిన రెండు రక్తనాళాలు మూసుకుపోయాయని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు వెళ్లి వైద్య సేవలు పొందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ వద్ద కొనసాగుతున్న షీట్ ఫైల్స్ పనులు

'మేడిగడ్డ'లో తుదిదశకు షీట్‌ఫైల్స్ పనులు

కొనసాగుతున్న సీసీ బ్లాక్‌ల రీ అరేంజ్‌మెంట్ • పర్యవేక్షించిన ఈఈ తిరుపతిరావు

మహదేవపూర్, జూన్ 18 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో చేపట్టిన షీట్ ఫైల్స్ అమరిక పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏడో బ్లాక్‌లోని 11 పిల్లర్లకు 15-22 పిల్లర్ల వరకు షీట్‌ఫైల్స్ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగతా 12, 13, 14వ పిల్లర్ల వద్ద పనులు కొనసాగుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు బరాజ్‌లో చేపట్టిన పనులను మంగళవారం భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పరిశీలించారు. బరాజ్ 20, 22వ పియర్ల వద్ద చేపట్టిన గ్రౌటింగ్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సీసీ బ్లాక్‌ల రీ అరేంజ్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయి. ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను తొలగిస్తున్నారు. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లకు 84 గేట్లను ఎత్తగా, 20వ గేట్‌ను ఆర్క్ గ్రౌగింగ్‌తో కట్ చేయగా, విడి భాగాలను తొలగించే పనులు జరుగుతున్నాయి.